నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శుక్రవారం 20 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా ఎకో బ్రిడ్జి నిర్మించాలి

బ్రిడ్జి నిర్మాణాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నీరజ్ కుమార్

వాంకిడి, డిసెంబర్ 19 : వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా ఎకో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ నేషనల్ హైవే అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని గోయేగాం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఎకో బ్రిడ్జిని నేషనల్ హైవే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన వెంట అటవీ శాఖ అధికారులు, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవోలు, నేషనల్ హైవే అధికారులు ఉన్నారు.

విద్యకు మించిన ఆయుధం లేదు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్పీ

విద్యార్థులను సన్మానించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, డిసెంబర్ 19: విద్యకు మించిన ఆయుధం మరొకటి లేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో సంతూర్ స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులను గురువారం పట్టణంలోని పద్మాశాలీ భవనంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదగాలంటే చదువు తప్పనిసరి అని, విద్య విలువలతో కూడిన జావితాన్నిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగూరే శ్యాంరావు, నాయకులు మిన్‌హాజ్, నక్క మనోహర్, మహిళా నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాబోయ్ పులి

- గుండాయిపేటలోని మిర్చితోటలో ప్రత్యక్షం
- అడుగులను గుర్తించి నిర్ధారించిన అధికారులు

పులి అడుగును గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు

కౌటాల, డిసెంబర్ 19 : గుండాయిపేటలోని మిర్చితోటలో గురువారం పెద్దపులి కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోకి పరుగులు తీసి గ్రామస్తులు, అటవీశాఖ అధికారులకు సమాచార మందించారు. కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వినయ్ కుమార్ సాహు పులి సంచరించిన ప్రదేశానికి వెళ్లి దాని అడుగులను గుర్తించి నిర్ధారించారు. ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ కారిడార్ పులుల ఆవాసానికి అనుకూలంగా ఉండడంతో మహారాష్ట్ర నుంచి పులులు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్, ఎఫ్ఎస్‌వో, ఎఫ్‌బీవో, యానిమల్ ట్రాకర్స్ ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హాజీపూర్, డిసెంబర్19 : హాజీపూర్ మండలం పాతమంచిర్యాల, ముల్కల్ల అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ రేంజ్ ఆఫీసర్ సుభాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పుశువుల కాపరులు అటవీ ప్రాంతానికి వెళ్లకూడదని, పంట చేలల్లో ఎలాంటి విద్యుత్ వైర్లు అమర్చకూడదని పేర్కొన్నారు.

నేటి నుంచి పాఠశాలల పనివేళలు మార్పు

ఆసిఫాబాద్ టౌన్,డిసెంబర్ 19 : చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి పాఠశాలల సమయంలో మార్పు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉండగా, ప్రస్తుతం ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు మారుస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బాలు, ఆదర్శ పాఠశాలలు, ప్రైవేట్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న పాఠశాలల్లో నూతన సమయపాలన పాటించాలని, మండల విద్యాధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పని చేసి నూతన సమయాన్ని అమలు చేయాలని తెలిపారు.

కౌటాల : అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దళిత సంఘం నాయకులు

'అమిత్ షా'పై ఆగ్రహ జ్వాల

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై దళిత సంఘాల మండిపాటు
- ఊరూరా ధర్నాలు.. రాస్తారోకోలు
- కేంద్రహోంశాఖ మంత్రి దిష్టిబొమ్మల దహనం
- రాజ్యాంగ నిర్మాతకు పాలాభిషేకాలు

నమస్తే నెట్‌వర్క్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ మేరకు గురువారం కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టాయి. అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేశాయి. కౌటాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. అమిత్‌షా దిష్టి బొమ్మను దహనం చేశారు. వాంకిడి జాతీయ రహదారిపై దళిత సంఘాల నాయకులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్ మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగం రచించడం వల్లే అమిత్ షా కేంద్ర హోం మంత్రి అయ్యారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహం ఎదుట ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, స్థానిక నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ముక్కు నేలకు రాసి యావత్ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటిమల భరత్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నస్పూర్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్ అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించారు. తాండూర్ మండలం కాసిపేటలో నేతకాని సంఘం నాయకుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. కాసిపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద మాదిగ హక్కుల దండోరా నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దళిత సంఘాల నాయకులు దహనం చేశారు. నేతకాని మహర్ హక్కుల సంఘం నేతలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, పాలాభిషేకం చేశారు.

బెల్లంపల్లి : కాంటా చౌరస్తా వద్ద అమిత్ షా దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మిల్లర్లపై కొరడా..!

2022-23 రబీ సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యంపై సర్కారు సీరియస్

- సీఎంఆర్ పెట్టకపోగా, ధాన్యం అమ్మేసుకున్న మిల్లర్లపై చర్యలకు సిద్ధం
- మంచిర్యాల జిల్లాలో రూ.100 కోట్లు బకాయిలు పడిన 23 మిల్లులు
- 34 మిల్లులు బకాయిలుంటే కేవలం 23 మిల్లులనే టార్గెట్ చేశారా..
- కేసులు పెట్టడంలో పక్షపాత ధోరణి ఎందుకంటున్న యాజమాన్యాలు
- శనివారం నుంచి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామంటున్న అధికారులు

మంచిర్యాల, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)గా ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించిన మిల్లర్లపై సర్కారు కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యాన్ని సీఎంఆర్ పెట్టడానికి మిల్లులకు ఆరునెలల సమయం ఉంటుంది. కానీ గడిచిన రెండు, మూడేళ్లుగా కొందరు మిల్లర్లు ఏడాది సమయం తీసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం కొంత మేర ధాన్యం సీఎంఆర్ పెట్టి.. మిగిలిన ధాన్యాన్ని బయట అమ్మేసుకుంటున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్లకు ఎంత ధాన్యం ఇచ్చాం. ఎంత సీఎంఆర్ ఇవ్వాలి. మిల్లర్లు ఎంత సీఎంఆర్ ఇచ్చారు. ఇంకా ఎంత బ్యాలెన్స్ ఉంది అని.. ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాలకు సంబంధించి మిల్లుర్లు సీఎంఆర్ ఇవ్వకుండా పెండింగ్ పెట్టిన రూ.7,650 కోట్ల విలువ చేసే 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసింది. వేలం పాడిన వారికి రూ.2,789 కోట్లు విలువ చేసే 13.92 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించింది. మిగిలిన ధాన్యం మా దగ్గర లేదంటూ కొందరు మిల్లర్లు చేతులు ఎత్తేయడంతో ధాన్యానికి బదులు డబ్బులు చెల్లించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.4,861 కోట్లు రావాల్సి ఉండగా, మంచిర్యాల జిల్లాకు సంబంధించి కొందరు మిల్లర్లు రూ.100 కోట్లు బకాయి పడ్డారు.

రెండు రోజుల్లో కట్టాల్సిందే..

మంచిర్యాల జిల్లాకు సంబంధించి 63,144 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేయగా, కేవలం 10,268 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటి దాకా లిఫ్ట్ చేశారు. ఇంకా 52,876 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉంది. దీనివిలువ రూ.100 కోట్లు ఉంటుందని గణాంకాలు చెబుతున్నాయి. జిల్లాలో ప్రభుత్వానికి బకాయి పడిన 23 మిల్లర్ల వివరాలు ఇలా.. రాఘవేంద్ర ఇండస్ట్రీస్(జన్నారం) రూ.12.86 కోట్లు, రాజరాజేశ్వరి ట్రేడర్స్(నర్సింగాపూర్)రూ.9.96 కోట్లు, రామలక్ష్మణ్ ఇండస్ట్రీస్(లింగాపూర్ దండేపల్లి) రూ.8.60 కోట్లు, గాయత్రి పీఎంఆర్‌బీ (సబ్బపల్లి హాజీపూర్) రూ.7.20 కోట్లు, శ్రీసాయి మణికంఠ ట్రే డర్స్ (నర్సింగాపూర్)రూ.5.54 కోట్లు, వరలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్ (ఇందారం జైపూర్) రూ.3.96 కోట్లు, శ్రీలక్ష్మి శ్రీనివాస ఇండస్ట్రీస్ (నందులపల్లి నెన్నెల) రూ.2.79 కో ట్లు, లక్ష్మీ గణపతి(అందుగులపేట్) రూ.2.73 కోట్లు, జయలక్ష్మి ఇండస్ట్రీస్(ఇందారం) రూ.2.55 కోట్లు, శ్రీనివాస రైస్ మిల్-మహాలక్ష్మి ట్రేడర్స్ (హమాలీవాడ మంచిర్యాల) రూ. 2.02 కోట్లు, ఎస్ఆర్ఎం ఇండస్ట్రీస్ (సబ్బేపల్లి) రూ. 2.01 కోట్లు, వాసవి పీఎంఆర్ఎం (అందుగులపేట్ ఎంఎంఆర్) రూ.1.94 కోట్లు, శివసాయి ఈపీ లక్ష్మీపూర్(లక్షెట్టిపేట) రూ.1.93 కోట్లు, వెంకటేశ్వర ఎంపీఆర్‌బీ (కన్నెపల్లి దండేపల్లి) రూ.1.82 కోట్లు, రాధాకృష్ణా ఇండస్ట్రీస్ (కన్నెపల్లి దండేపల్లి) రూ.1.28 కోట్లు, శ్రీ శివరామకృష్ణ ట్రేడర్స్ (మిట్టపల్లి) రూ. 16 లక్షలు, బీఎస్‌వై రా-రైస్ మిల్ (ముదిగొండ) రూ.8.49 కోట్లు, దుర్గ ఇండస్ట్రీస్ (నర్సింగాపూర్) రూ.8.16 కోట్లు, హనుమాన్ ఆగ్రో ఇండస్ట్రీస్(మంచిర్యాల) రూ.6.21 కోట్లు, వాసవీమాత మాడ్రన్ రైస్ మిల్(తాండూర్) రూ.5.79 కోట్లు, శ్రీ వెంకట రమణ ఆగ్రో ఇండస్ట్రీస్ (కోటపల్లి)రూ.1.78 కోట్లు, సోమేశ్వర రైస్ మిల్(ఆస్నాద్) రూ.1.76 కోట్లు, శ్రీ రాజరాజేశ్వర మోడ్రన్ రైస్ మిల్ రూ.1.01 కోట్లు బకాయి పడ్డాయి. ఈ మిల్లులన్నీ శనివారం లోగా పెండింగ్ పడిన మొత్తాన్ని క్లియర్ చేయాలని అధికారులు ఆదేశించారు.

గతంలోనూ కేసులు.. ధాన్యం కేటాయించాలంటున్న మిల్లర్లు..

సీఎంఆర్ ఇవ్వకుండా, మిల్లులో ఆ ధాన్యం చూపించకుండా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే ఏడుగురు మిల్లర్లపై ఆర్ అండ్ ఆర్ యాక్ట్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఒకరిద్దరు మిల్లర్లను అరెస్టు సైతం చేశారు. కాగా జిల్లాలో 34 మిల్లులు 2022-23 రబీ సీజన్‌కు సంబంధించి ధాన్యం డబ్బులు కట్టాల్సి ఉందని మిల్లర్లు అంటున్నారు. కొందరు మిల్లర్లను తప్పించి ఉద్దేశపూర్వకంగా కేవలం 23 మిల్లులపైనే కేసులు పెట్టేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. 34 మిల్లులు డబ్బులు కట్టాల్సి ఉంటే.. కేవలం 23 మిల్లులపైనే కేసులు ఎందుకో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పక్షపాతధోరణితో కులవివక్ష చూపుతూ కేసులు నమోదు చేస్తున్నారంటూ మండిపడుతున్నారు. రెండు రోజుల్లో పెండింగ్ పడిన కోట్లాది రూపాయాలు కట్టమంటే ఎక్కడి నుంచి తెచ్చి కట్టాలో చెప్పాలంటున్నారు. ధాన్యం కేటాయించి కొంత సమయం ఇస్తే పాత, కొత్త పెండింగ్ ధాన్యాన్ని ఇచ్చేందుకు మిల్లర్లం సిద్ధంగా ఉన్నామంటున్నారు. 2022-23 రబీ ధాన్యాన్ని దించేప్పుడు పూర్తిగా సహకరిస్తామని చెప్పిన అధికారులే ఇప్పుడు మామీద కక్ష కట్టారని వాపోతున్నారు. ఆ ఏడాది వర్షాల కారణంగా దించుకున్న ధాన్యం తడిసిపోయి నష్టపోవాల్సి వచ్చిందని, ఆ ధాన్యాన్ని మరాడిస్తే నూకలు తప్ప ఏం రాలేదని.. దాన్ని సగం ధరకు అమ్ముకొని వచ్చే సీజన్‌లో ధాన్యంతో కవర్ చేద్దామనుకున్నామని చెబుతున్నారు. ధాన్యం ఇస్తే తప్ప పెండింగ్ బకాయిలు కట్టలేమని ఆర్ అండ్ ఆర్ చట్టం కింద మా ఆస్తులు జప్తు చేసినా పెండింగ్ ఉన్న మొత్తం రాదంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మిల్లర్ల మెడపై కత్తి పెట్టడం ఎంత వరకు సమంజసమని వాపోతున్నారు. ప్రభుత్వం తమ పక్షాన సానుకూల దృక్పథంతో ఆలోచించాలని కోరుతున్నారు.

మిల్లర్లపై క్రిమినల్ కేసులు

- మోతీలాల్, అదనపు కలెక్టర్, మంచిర్యాల జిల్లా

2022-23 రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్లు కట్టాల్సిన మొత్తం శనివారం లోగా చెల్లించాలి. ఇప్పటికే చాలా సమయం ఇచ్చాం. ఈ రెండు రోజుల్లో 50శాతం వేలం వేసిన ధాన్యం డబ్బులైనా కట్టాలి. లేనిపక్షంలో మిల్లర్లు, వారి ష్యూరిటీ/గ్యారంటీదార్లపై సంయుక్తంగా కేసులు నమోదు చేస్తాం.

అధికారి.. ఆ పక్కనే దళారీ

- పరస్పరం సహకారించుకుని పత్తి రైతులను నిండా ముంచుతున్న వైనం
- తేమ శాతం ఎక్కువగా ఉందని సేకరణకు సీసీఐ నిరాకరణ
- ఆ వెంటే తక్కువ ధరకు కొని.. అదే మిల్లులో ఎక్కువ ధరకు విక్రయిస్తున్న వ్యాపారులు
- తప్పనిసరి పరిస్థితుల్లో అమ్ముకొని నష్టపోతున్న కర్షకులు

ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ కేంద్రాల ముందు బారులు తీరిన పత్తి వాహనాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : ''ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిని ఓ రైతు జిన్నింగ్ మిల్లులో అమ్మేందుకు తీసుకువచ్చాడు. అధికారి పత్తిలోని తేమను పరీక్షించాడు. తేమ శాతం ఎక్కువగా ఉంది సీసీఐ ద్వారా కొనలేమని చెప్పాడు. అంతలోనే పక్కనున్న దళారీ క్వింటాలుకు రూ. 6500 చొప్పున కొంటానని ముందుకొచ్చాడు. గత్యంతరం లేని పరిస్థితిలో ఆ రైతు దళారీకి 30 క్వింటాళ్ల పత్తిని విక్రయించాడు. ఆపై దళారీ అదే జిన్నింగ్ మిల్లులో క్వింటాలుకు రూ. 7521 చొప్పున సీసీఐకి పత్తిని అమ్మేశాడు. రైతు చూస్తుండగానే సదరు వ్యాపారి రూ. 30 వేలకు పైగా లాభాన్ని పొందగా, రైతు మాత్రం తీవ్రంగా నష్టపోయాడు.'' సాక్షాత్తూ సీసీఐ అధికారుల సహకారంతో జిన్నింగ్ మిల్లులో తిష్టవేసిన దళారులు(జిన్నింగ్ మిల్లుల యజమానులు ఏర్పాటు చేసుకున్న వ్యక్తులు) రైతులను నిండా ముంచుతున్నారు. తేమ పేరుతో సీసీఐ అధికారులు పత్తిని కొనేందుకు నిరాకరించడం.. వెంటనే దళారులు రైతుల వద్ద పత్తిని కొనుగోలు చేయడం. అదే పత్తిని సీసీఐకి ఎక్కువ ధరకు దళారులు విక్రయించడం.. ఇక్కడ పరిపాటిగా మారింది.

దళారుల నిలువుదోపిడీ..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 17 జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. ఆలస్యంగా సేకరణ ప్రారంభించిన సీసీఐ రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేందుకు అనేక ఆంక్షలు పెడుతున్నది. దళారులతో కలిసి పత్తి రైతులను నిలువునా ముంచుతున్నది. సీసీఐ 8 శాతం తేమ ఉన్న ఏ గ్రేడ్ పత్తి క్వింటాలుకు రూ. 7521, 9 నుంచి 12 శాతం తేమ ఉంటే ఒక్కో శాతానికి రూ. 75 ధర తగ్గించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒకసారి పత్తిని రైతు మార్కెట్‌కు తీసుకువచ్చిన తర్వాత దానిని తిరిగి తీసుకుపోవడం ఉండదు. అధికారులు తేమ పేరుతో నిరాకరించినప్పటికీ పత్తిని తప్పని సరిగా అమ్ముకొని పోవాల్సి ఉంటుంది. పత్తిలో తేమ ఎక్కువగా ఉందని చెబితే దానికి తిరిగి తీసుకువెళ్లి ఆరబెట్టుకోవడం కుదరదు. ఒకవేళ తిరిగి తీసుకుపోవాలనుకున్నా శ్రమతో పాటు వాహన ఛార్జీలు ఎక్కువగా అవుతాయి. దీంతో జిన్నింగ్ మిల్లుకు పత్తి తీసుకువచ్చిన రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో పత్తిని అమ్ముకుంటారు. ఇదే అదనుగా భావించి దళారులు పత్తిలో తేమ ఎక్కువగా ఉందనో, ఇటీవల వర్షాలకు రంగు మారిందనో సాకులు చూపి కొనుగోలు చేసేందుకు సీసీఐ అధికారులు నిరాకరిస్తుండగా, అదేపత్తిని దళారులు అక్కడే కొని అదే జిన్నింగ్ మిల్లుల్లో విక్రయిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. దళారులు తమకు తెలిసిన రైతుల పట్టాపాస్ బుక్కులు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయిస్తూ పత్తిని దర్జాగా విక్రయిస్తున్నారు. ఇదంతా మార్కెట్ అధికారుల ముందే జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

మంచిర్యాలకు కొత్త మాస్టర్ ప్లాన్

డ్రోన్ ఏరియల్ సర్వేను ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్

డ్రోన్ ఏరియల్ సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 19 : మంచిర్యాలకు కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనుండగా, ఇందుకు సంబంధించిన డ్రోన్ ఏరియల్ సర్వేను గురువారం మంచిర్యాల పట్టణంలోని జడ్పీ పాఠశాల మైదానంలో కలెక్టర్ కుమార్ దీపక్ ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టిన అమృత్ 2.0 పథకంలో భాగంగా నూతన మాస్టర్ ప్లాన్‌ల తయారీకోసం మంచిర్యాల మున్సిపాలిటీని ఎంపికచేశారు. డ్రోన్ ఏరియల్ సర్వేను డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డైరెక్టర్ మైఖేల్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని నివాస, వాణిజ్య, వ్యవసాయ భూముల గుర్తింపు, అభివృద్ధి, ఇతర అంశాల పరిశీలన కోసం డ్రోన్ ఏరియల్ సర్వేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సర్వేలో భాగంగా అమృత్ 2.0 సంబంధించి నివేదిక అందిన తర్వాత అందుకనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌లో మార్పులు చేసి సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తామన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రతిపాదనలున్నందున డ్రోన్ ఏరియల్ సర్వే ద్వారా భూముల సమాచారం సేకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో గణపతి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, డీవైఎస్‌వో రాజ్‌వీర్, మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్, టీపీవో సంపత్, టీపీఎస్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజనురాలికి సరుకులు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాస్

వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జూర్, డిసెంబర్ 19 : యువత వ్యసనాల కు దూరంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాస్ పే ర్కొన్నారు. గురువారం మారుమూల గ్రామమైన నాగెపల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడంతో పాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మొగవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగెపల్లి, దొడ్డిగూడ గ్రామంలో మొత్తం 100 కుటుంబాలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేశామన్నారు. యువకులకు వాలీబాల్ కిట్లు అందించామన్నారు. కౌటాలలోని విజేత దవాఖాన ఆధ్వర్యంలో చికిత్సలు చేయించి మందులు అందిస్తున్నామని తెలిపారు. మొత్తం 250 మందికి వైద్యులు సూర్యకృష్ణ చికిత్స చేశారు. మొగవెల్లి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని బెజ్జూర్ ఎస్ఐ ప్రవీణ్, కౌటాల సీఐ ముత్యంను ఎస్పీ అదేశించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, సీఐ ముత్యం, ఎస్ఐ ప్రవీణ్, మాజీ సర్పంచులు శంకర్, లక్ష్మి, హన్మంతు పాల్గొన్నారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ..

- సూపర్ వాస్మోల్ తాగిన నలుగురు యువకులు
- మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలింపు

మందమర్రి, డిసెంబర్ 19 : పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ మందమర్రి పట్టణానికి చెందిన నలుగురు యువకులు సెల్ఫీ వీడియో తీసుకొని సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నం చేసుకోవడం కలకలం సృష్టించింది. మందమర్రిలోని చెంచుకాలనీ, విద్యానగర్, యాపల్ ఏరియాలకు చెందిన యువకులు ఆవుల షారూక్, మేశ్రం రాజు, బామండ్ల శివ, సెగ్గం అజయ్ కుమార్ గురువారం ఒకేచోట చేరి .. తమను పోలీసులు వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నామని సూపర్ వాస్మోల్ తాగారు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు వారిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కేసుల నుంచి తప్పించుకోవడానికే..

తమపై నమోదైన కేసుల నుంచి తప్పించుకోవడానికే పట్టణానికి చెందిన నలుగురు యువకులు సూపర్ వాస్మోల్ తాగారని మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ నలుగురు యువకులు మరికొంత మందితో కలిసి మందమర్రి ఏరియాలో మూసివేసిన కేకే 1 గని వద్ద ఇనుప సామగ్రి దొంగతనానికి వెళ్లారని, అడ్డువచ్చిన సింగరేణి సెక్యూరిటీ సిబ్బందిపై దాడికి పాల్పడ్డారన్నారు. సెక్యూరిటీ అధికారుల ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసులు నమోదు చేశామని, పూర్వపు నేర చరిత్ర ఉన్న వారిని రిమాండ్‌కు తరలించినట్లు వారు వివరించారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. ఆత్మహత్య యత్నానికి పాల్పడిన నలుగురు యువకులపై మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్, మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లలో పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఆవుల షారూక్‌పై నాలుగు, మేశ్రం రాజుపై ఏడు, బామండ్ల శివపై మూడు, సెగ్గం అజయ్ కుమార్ పై మూడు కేసులు నమోదయ్యాయని వివరించారు. పోలీసులు ఎవరిని వేధించలేదని, అకారణంగా పోలీస్‌స్టేషన్‌కు పిలువ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నలుగురు యువకుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారని వారు తెలిపారు.